# నిచ్చెన పైకి మెట్లు కిందకి

కనుచీకటి పడే వేళ - శీతాకాలం కావడం వల్ల చీకటి వేగంగా కమ్ముకొస్తోంది.

"సారూ! ఇదిగో డబ్బా" అని కేకపెట్టి పరుగెట్టిపోయాడు సాంబు.

నారాయణ లోపల్నుంచి వచ్చి అటూ ఇటూ చూసి అది తీసి పక్కనే ఉన్న బల్లకిందకి తోశాడు. గుమ్మం వైపుకళ్ళు చికిలించి చూశాడు. ఇంటి ముందు కూర్చుని అంట్ల గిన్నెలు తోముతున్న వరాలు కూడా లోపలికి వస్తున్న కూతుర్ని చూసి బకెట్టులో చేతులు ముంచి కడిగేసుకుని లేచింది.

"ఏంటమ్మా కమలా! పొద్దుగూకి వచ్చావు" అంటూ ఎదురెళ్ళింది.

నారాయణ బయటకొచ్చి కూతుర్ని చూసి "ఏంటి తల్లి బాగున్నావా" అన్నాడు.

ఇద్దరికీ ఒకేసారి "ఆ బాగానే ఉన్నాను" అంటూ కుండలో నీళ్ళు లోటాతో ముంచుకుని గటగటా తాగేసింది. అక్కడే వేసివున్న నులక మంచం మీద కూలబడింది.

"పొద్దుటేల ఎండ, రాత్రి చలి, ఆ బస్సు దొరికేతలికి గంట పట్టింది" అంది కమల అలసటగా.

"ఒక్కతివే వచ్చావా" అంది వరాలు. కమల సమాధానమేం చెప్పలేదు. మూతినించి కారుతున్న నీళ్ళని కొంగుతోతుడుచుకుని మంచం మీద ఒరిగింది.

వరాలు, నారాయణ మళ్ళీ ఏం మాట్లాడలేదు.

"ఆకలవుతా వుంది. అన్నం ఉంటే పెట్టవే అమ్మా" అంది కమల. వరాలు మనసు కరిగిపోయింది. ఏమంటూ పిల్లకి పెళ్ళి చేసి పంపారో ఆనాటినుంచి కూడా పిల్ల సుకంగా లేనేలేదు. చిక్కి సగమైంది. ఎప్పుడూ ఏదో ఒక గొడవే. ఏదో ఒక తగువే.

అరసోలెడు బియ్యం ఉడికించి పనిచేసే ఇంట్లోంచి తెచ్చిన పులుసేసి పెట్టింది.

కమల అపురూపురుమంటూ తింటూ వుంటే వరాలకి కళ్ళు నీళ్ళు గిర్రున తిరిగాయి.

వీధిలో ఎవరో పిలుస్తున్నారు నారాయణ మనసు చిరాకుగా అయిపోయింది.

"ఓ రెండు లీటర్లు గ్యాసులిన్ పొయ్యయ్యా"

"పాతిక రూపాయలకి గానీ గిట్టదమ్మా - చస్తున్నా తేలేక".

"గవర్నమెంటు సచ్చినోళ్ళు కారుడు మీద పది లీటర్ల రాసారు గానీ, ఆళ్ళనోళ్ళు బడా ఒక్కలీటరు ఇస్తలేరు. పొయ్యయ్యా బువ్వ తినాలిగా" అందామె.

నారాయణ యాభై రూపాయల నోటు పదిలంగా రేకు డబ్బాలో పెట్టిమూత పెట్టాడు.

అసలు రేటు తొమ్మిదిన్నర, నారాయణ పదిహేనుక్కొని పాతిక్కమ్ముతున్నాడు. లీటరు మీద పది రూపాయలు లాభం. అడపా, తడపా వాళ్ళనీ, సంతోషపడుతూ, రహస్యంగా గడుపుకు రావాలి మరి.

రాత్రంతా తల్లిపక్కన పడుకుని కమల గుసగుసలాడుతూనే ఉంది. వరాలు గుండెలు గుబగుబలాడుతూనే ఉన్నాయి. తెలతెలవారుతుంటే నిద్రపోయారు ఇద్దరు. బాగా ఎండెక్కిపోయింది లేచేసరికి. వరాలు పనికి ఎగనామం పెట్టింది. నారాయణతో వాదానికి దిగింది.

స్థోమతకి మించిన సంబంధం ఎందుకు చెయ్యాలన్నది వరాలు వాదన.

"పైకి ఎదగాలని ఆశపడాలి గానీ, నీలాగే దాన్నిపాచి పని చేసుకుని బతకమంటావా" అంటూ గయ్యిమన్నాడు నారాయణ.

"అలాగని దానిక సుకం లేకుండా చేసావు గదయ్యా" అంది వరాలు.

"ఆ... నీకంతా కంగారు. గొడవలొస్తయ్ పోతయ్. దానికోసం భయపడితే ఎట్టా?" అని కొట్టిపారేశాడు.

• • •

నారాయణకి ఆశ చాలా ఎక్కువ. ఎలాగోలాగ బాగా డబ్బు సంపాదించి గొప్పవాడినవ్వాలని బలమైన కోరిక. అందుకే కట్టుబట్టలతో జీవితం ప్రారంభించిన నారాయణ ఇప్పుడు ముప్పై గజాల జాగాలో సొంతంగా రేకులతో రెండు గదులేసుకునే స్థాయికి వచ్చాడు. అతని భార్య వరాలు మాత్రం ఎప్పుడూ నాలుగిళ్ళలో పాచిపనులు చేసి సంసారం గడుపుతూనే ఉంది. వాళ్ళకు ఒకే ఒక బిడ్డ కమల. ఆమెని చదివించి డాక్టరునో, కలెక్టరునో చెయ్యాలని నారాయణ ఎప్పుడూ అనుకోలేదు కానీ గొప్పింటి కోడల్ని చెయ్యాలని మాత్రం కంకణం కట్టుకున్నాడు.

ఇల్లూ, వాకిలీ ఉండాలి. ఇంట్లో టీవి ఉండాలి. కుర్చీలు, మేజా బల్ల ఉండాలి. మంచాలుండాలి. తళతళ మెరిసే స్టీలు కంచాలుండాలి. గ్యాసుస్టవ్ ఉండాలి. ఇలాంటి సామానుతో తన కూతురు దర్జాగా ఉండాలి. అదీ నారాయణ కోరిక. కమల కోసం

చిన్నప్పటి నుంచి పైసా పైసా కూడబెడుతూ వచ్చాడు.

చీటీలు కట్టి మెడలో గొలుసు, కాళ్ళకు వెండి పట్టాలు, చెవులకు బుట్టలు చేయించాడు. కమల ఎర్రగా బాగానే ఉంటుంది. అందువల్ల తన కూతుర్ని అంతస్తు ఉన్నవాడు చేసుకుంటాడని గట్టి నమ్మకం. అతనికి కాస్త ఎక్కువ కట్నం ఇచ్చి అయినా డబ్బున్న కుర్రాడికి ఇచ్చి చేయాలనుకున్నాడు.

నారాయణ కొన్నాళ్ళు కూరగాయల బండిపెట్టాడు. కొన్నాళ్ళు మిరపకాయల బజ్జీలు, వడలు వేసి అమ్మాడు.

కమలకి అనుకున్నట్లు గొప్ప సంబంధమే దొరికింది. వరాలు మాత్రం తన పని చేసుకుంటూ, మొగుడ్ని సాధిస్తూనే ఉంది.

ఆ పెళ్ళివాళ్ళకి పల్లెటూర్లో మూడెకరాల భూమి ఉందిట. ఇక్కడ రకరకాల వ్యాపారాలున్నాయట. పిల్లాడికి చదువు లేకపోయినా ఎర్రగా దొరబాబులా ఉన్నాడు. వాళ్ళు అడిగిన కట్నమిచ్చి, లాంఛనాలు జరిపించి, ఆర్భాటంగా పెళ్ళిచేశాడు నారాయణ. ఇంకా రెండు తులాల బంగారం గొలుసు అల్లుడికి పెట్టాల్సి ఉంది. తరచు అత్తగారు, మొగుడు గొలుసు తెమ్మని కమలని పంపుతూ ఉంటారు పుట్టింటికి.

మగపిల్లాడికి బంగారు గొలుసేంటని వరాలు నెత్తి, నోరు మొత్తుకుంటూనే ఉంటుంది. కానీ నారాయణ మాట ఇచ్చాడు అంతే-

సరదాలుంటాయిగా, అయినా మనల్లుడేగా అని సర్దిచెబుతూ ఉంటాడు నారాయణ. కానీ అతనికొచ్చే ఆదాయం అప్పులకీ, వడ్డీలకీ చాలీ చాలకుండా ఉంది.

దొరబాబులా ఉన్న రమేష్ కమలకి నచ్చాడు. అతని షోకులు, డ్రస్సులు, క్రాపు అన్నీ నచ్చాయి. కానీ పెళ్ళయిన కొన్నాళ్ళకే కమలకి మనశ్శాంతి లేకుండా పోయింది.

రమేష్ గుడుంబా వ్యాపారం చేసి, రోజుకి రెండు వేలు మూడు వేలు సంపాదిస్తాడు కాని పది రోజులకొకసారి పోలీసులొచ్చి పడి ఎంతో కొంత వాడుక్కుపోతారు. డబ్బులున్నప్పుడు మహాదర్జాలకి పోయి, లేనప్పుడు అవస్థపడుతూ ఉంటారు. విడిపించుకునేందుకు డబ్బులు వెదుకులాట, కేసులు, జరిమానాలు, జామీనులు - నిత్యం జరిగిపోతూనే ఉంటాయి.

ఇప్పుడు కమలెందుకొచ్చిందంటే - నిన్న పోలీసులొచ్చి, ఇల్లు సోదాచేసి గోడలో రహస్యంగా దాచిన గుడుంబా ప్యాకెట్లు పట్టుకుని రమేష్‌ని అరెస్ట్ చేసి తీసుకుపోయారు. అత్త రాగాలు, మావ పరుగులు - చుట్టుపక్కల వాళ్ళ చోద్యాలు కమలకి వికారం కలిగించాయి. చివరికామె నెత్తిమీద కొచ్చి పడిందేమంటే 'ఇంటికెళ్ళి రెండు వేలడిగి పట్రా - వాడ్ని విడిపించాలి' అంటూ ఆమెని పుట్టింటికి తరిమారు.

● ● ●

వరాల్ని చూసి సుశీలమ్మ సర్రున లేచింది. "ఏమే నీ ఇష్టం వచ్చినట్టు అస్తమాను

మానేస్తే నాకెలా కుదురుతుంది? తెల్లారి లేస్తూనే పిల్లబండి దిగింది. ఇంటినిండా పని - దానితో ఒక్కమాట లేదు మంతిలేదు. నేనీ పనితోనే చచ్చిపోయేటట్టున్నాను. చేసుకోలేకనే కదా వందలు వందలు పోసి పెట్టుకోవడం" ఆమె అరుస్తూనే ఉంది.

వరాలు జవాబేం చెప్పకుండా పనందుకొంది.

"నాకు చేతకాలేదమ్మా అందుకే రాలేక పోయా" అని మాత్రం చెప్పింది. నిజానికి వరాలు కూడా ఒకటికి నాలుగు మాటలు అనేదే కానీ ఇప్పుడు ఓపిక లేదు. మనసు బాగాలేదు. అందుకే మౌనంగా అంట్లు తోముతోంది. సుశీలమ్మకి మనసేం బాగాలేదు. ఆమె ఉరుములు, మెరుపులతో ఉగ్రరూపం దాల్చిన ఆకాశంలా ఉంది.

సుశీలమ్మ కూతురు లావణ్య తెల్లారుతూనే రైల్లో దిగింది. ఎక్కించినట్టు రాత్రి అల్లుడు ఫోనులో చెప్పాడు. పొడిపొడిగా అతను మాట్లాడిన తీరునుబట్టి కుటుంబరావు గుండెల్లో బండరాయి పడింది. నెమ్మదిగా ఆ రాయిని బద్దలు గొట్టి సగం ముక్క సుశీలమ్మ గుండెల్లోకి చేర్చాడు.

కూతురి ముఖంలో దిగులు, దీనత్వం చూసి భార్యాభర్తలు విలవిల్లాడిపోయారు.

ఏమిటి కారణం? డబ్బు! డబ్బు! డబ్బు.

అందరికీ ఊరికే కష్టపడకుండా డబ్బు రావాలి. ఎవరి తల బద్దలు కొడదామా అనే ఆలోచన. కూతుళ్ళని గొప్ప ఇంట్లే ఇస్తే డబ్బుండి సుఖపడతారని తల్లిదండ్రుల ఆశ. ఎవరి ఆశ వారిది. ఎవరి ప్రయత్నం వారిది.

సుశీలమ్మకి ఆడంబరాలంటే మోజు. ఇల్లు, కారు, ఖరీదైన సామాను ఉండాలి. ఫ్రిజ్, టీవి, వీసిఆర్, డి.వి.డి ప్లేయర్, ఏసి, వాషింగ్ మిషన్, మిక్సీ, టోస్టర్, మైక్రోవేవ్, కాఫీమిషన్ - ఎలక్ట్రికల్ రైస్‌కుక్కర్ - వీటన్నిటితో కూడిన తన కూతురు ఇల్లు సుశీలమ్మ ఊహల్లో మెరుస్తూ ఉంటుంది.

అయితే ఇంత ఆడంబరంగా అన్నీ ఉన్నవాళ్ళు నిరాడంబరంగా ఎలా ఆలోచిస్తారు? వాళ్ళకా వస్తువులను ప్రదర్శించుకోవడంలోను, వాటి గురించి గొప్పలు చెప్పుకోడంలోనే ఆనందం, అతిశయం ఉంటాయి. చిన్నకారుంటే పెద్దకారు, సింగిల్ డోర్ ఫ్రిజ్ ఉంటే డబుల్ డోర్, చిన్నస్క్రీన్ ఉన్న టీవీ తీసేసి పెద్దది కావాలి.

ప్రతి దానికి డబ్బుతో ముడి. ఈ రోజుల్లో వస్తువుకొని ఇంటికి తెచ్చుకోవడం పెద్ద సమస్యేం కాదు. వెంటపడి మరీ అమ్ముతారు. వాటి కొనుగోలు ఉచ్చునుంచి తప్పించుకోవడమే కష్టం.

రెండు లక్షల స్థోమత ఉన్న కుటుంబరావు నాలుగు లక్షల కట్నం ఇచ్చి పెళ్ళి చేశాడు. దానికి తగినట్టుగా పెళ్ళి ఖర్చులు, పెట్టుబడులూ పెరిగాయి. అప్పులూ పెరిగాయి. అప్పుల మీద వడ్డీలు పెరిగాయి. మధ్యలో వచ్చే ఖర్చుకి మళ్ళీ మళ్ళీ డబ్బు సర్దుబాట్లూ పెరిగాయి. అన్నీ పెరిగాయి. మనశ్శాంతే తగ్గింది. కంటిమీద కునుకు కరువైంది.

వరాలు నాలుగిళ్ళలో పని ముగించుకుని ఇంటికి వచ్చేసరికి కమల అత్త గుమ్మంలో కూర్చుని ఉంది. కమల ముఖం ముడుచుకుని వంట చేస్తోంది. "బాగున్నావా రంగమ్మొదినా" అని పలకరించింది. "ఏం బాగులే వదినా! బాగుంటే పరుగెడుతూ మీ ఇళ్ళకి వచ్చే పనేముంది".

వరాలా మాటాలు విన్నా జవాబేం చెప్పలేదు. కాసేపటికి రంగమ్మ ఏడుపు మొదలు పెట్టింది.

పైసలుకట్టి మొగుడ్ని, కొడుకుని తీసుకురావాలంటూ రాగాలు పెడుతూ కూర్చుంది.

ఎవరో ఒకరు వస్తున్నారు. లీటరని, రెండనీ కిరసనాయిలు తీసుకుపోతున్నారు. ఒకామె బైటకు పోతూ కాస్త గట్టిగానే అంటోంది.

'మొన్నటి రోజున ఇరవై అయిదుకిచ్చాడు – నిన్న ముప్పై, ఈ రోజు ముప్పై అయిదంట. వీళ్ళ నోట్లో మన్నుబడ ఏం బాగుపడతారో'.

ఆ మాటలు ఇంట్లో ఉన్నవాళ్ళ చెవులో పడ్డాయో, లేదోగాని ఎవ్వరేం మాట్లాడలేదు.

'ఎందుకీ యాపారం. అందరి తిట్లూ తినే దానిక్కాపోతే' అంది వరాలు.

నారాయణ కస్సుమన్నాడు. ఏ పని చెయ్యకపోతే అవసరాలెలా తీర్తాయి.

రంగమ్మ రాత్రంతా కమలను సముదాయిస్తూనే ఉంది. కమల మాత్రం కసిరి కొడుతూనే ఉంది. వరాలకేం అర్థం గాక చాటుగా కూతుర్ని అడిగింది. ఏం లేదని చెప్పి ఆమె విసుక్కుంది. పైకి విసుక్కున్నా లోపల కమల కడుపు మండిపోతోంది. పోలీసు హెడ్డు తనని రమ్మన్నాట్ట. వస్తే వాళ్ళని వదిలేస్తానన్నాట్ట. అత్తగోల అర్థంకాని తల్లిగోల, పది రూపాయల వడ్డీకి రెండు వేలు తెచ్చిన తండ్రి తెగింపు.

డబ్బు తీసుకుని అత్తతోవెళ్ళమని తల్లీదండ్రి కమలకి నచ్చచెప్తున్నారు. కమలకి బతుకు మీద విరక్తి కలిగిపోయింది.

• • •

తెల్లారి లేస్తూనే వరాలు పనిలోకి రాలేదని సుశీలమ్మ గంగ వెర్రులెత్తుకుపోతోంది.

లంచం పుచ్చుకుంటూ పట్టుబడిన అల్లుడ్ని అర్జెంటుగా రక్షించడానికి యాభైవేల కోసం కుటుంబరావు, సుశీలమ్మ తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. ఇంట్లో నగలన్నీ ఊడ్చిపెట్టినా ముప్పై వేలకి మించలేదు. మిగిలిన ఇరవైవేలు వడ్డీకి సమకూర్చుకుంటూ హడావిడి పడుతున్న సమయంలో వరాలు పనికి రాకపోవడం సుశీలమ్మకి అగ్గిమీద ఆజ్యం పోసినట్టయింది.

ఈసారి ముఖం వేలాడేసుకుని వరాలు పనిలోకి వచ్చినా చచ్చినా పనిలోకి పెట్టుకోకూడదని ఒట్టేసుకుంది. పక్కింట్లో పనిచేసే రాధికను పిలిచి అడిగింది పని చెయ్యమని.

"అదేమిటమ్మా ఆళ్ళ బిడ్డ కిరసనాయిలోసుకుని ఒళ్ళు కాల్చుకుందని దవఖానకు

తీస్కుపోయింద్రు తెల్వదా" అందామె.

సుశీలమ్మ గజగజా వణికిపోయింది. పరుగెట్టికెళ్ళి గదిలో నీరసంగా పడుకున్న కూతుర్ని చూసుకుంది. ఆమెకు వరాలు సంగతులు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి. ఆవేశం కమ్ముకొచ్చేసింది. కసితో మనసు రగిలిపోయింది.

ఈ మగాళ్ళేం చేసినా అవన్నీ ఆడవాళ్ళ నెత్తిమీదకే వచ్చి పడతాయి. డబ్బు గల వాళ్ళమవుదామనుకోవడంలో తప్పులేదు గానీ, ఎలా సంపాదించాలీ అనేది ఆలోచించాలి కదా – ఇలాచేస్తే తప్పేమిటి? ఇలాచేస్తే తప్పేమిటి అని ఎదురుప్రశ్నలు వేస్తారు. లోకం మారిపోయిందని, అవినీతి అన్యాయం సహజమైపోయాయని, బల్లగుద్ది మరీ చెప్తారు.

లంచగొండితనం ఆనవాయితీగా, ఫార్మాల్టీగా చెలామణీ అయిపోతోంది. అందరూ నల్లమేకను తెల్లమేక అంటున్నారు. ఒకరో, ఇద్దరో కాదని తెలిసినా నెగ్గలేక నోరు మూసుకుంటున్నారు.

సుశీలమ్మ సింకులో గిన్నెలు బరబరా తోముతూ, అంతకంటే వేగంగా లోలోపల వాపోతున్నది. ఆలోచన కసి గిన్నెల మీద కనిపిస్తోంది.

ఇంతలో బెల్లుమోగింది. చేతులు కడుక్కుని వెళ్ళింది. కుటుంబరావు నెమ్మదిగా లోపలికి వచ్చాడు. సుశీలమ్మ తలుపేసి వెనక్కి తిరిగింది.

"ఇది జాగ్రత్తగా లోపల పెట్టు" అని ఒక కవరు భార్య చేతికి ఇచ్చాడు.

ఆ కవరు బరువుగా ఉంది. ఆమెకి ఆ కవరులో ఏముందో తెలుసు. ఆమెలో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఎవరో మారాలని ఎన్నాళ్ళు ఎదురు చూస్తాం? ముందు మనమే మారాలి. సుశీలమ్మ చేతిలో ఉన్న కవర్ని బలం కొద్దీ గోడకేసి కొట్టింది.

అవినీతి అందులోంచి బయటపడి ఇల్లంతా పర్చుకుంది. ఇంక చీపురుతో తుడిచి పారబొయ్యాలి.

(12-3-2006 ఆంధ్రజ్యోతి ఆదివారం.)